
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 28.4 । కనిష్ఠం 25.1



నిజామాబాద్
జిల్లా వార్తలు
ఆదివారం 23 జూన్ 2024



- మండల, డివిజన్లలో రోజువారీగా దరఖాస్తుల పరిశీలన
- ఏ రోజుకు ఆరోజు సమస్యలను పరిష్కరిస్తున్న అధికారులు
- వారం రోజుల్లో అన్ని దరఖాస్తులను పరిష్కరించేందుకు నిర్ణయం
- జిల్లాలో ఇప్పటివరకు 43వేల దరఖాస్తుల పరిష్కారం
- బోధన్‌లో రెండు రోజుల పాటు ధరణిపై సమీక్షించిన ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

ధరణి సమస్యల పరిష్కారానికి కసరత్తు!

నిజామాబాద్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ధరణి సమస్యల పరిష్కారానికి అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. మండలాల వారిగా యుద్ధ ప్రాతిపదికన సమస్యలను పరిష్కరిస్తున్నారు. రైతులకు మూడంచెల పద్ధతిలో దరఖాస్తు చేసుకున్న వాటన్నింటిని పరిశీలిస్తూ ఎక్కడికక్కడ పూర్తిచేస్తున్నారు. ప్రభుత్వఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో వారం రోజుల్లోనే మొత్తం సమస్యలను పరిష్కరించేలా ప్రయత్నాలను చేస్తున్నారు. మండలాల వారిగా టార్గెట్‌లు విధించి రైతులతో మాట్లాడుతూ పెండింగ్ దరఖాస్తులన్నీ బయటకు తీస్తున్నారు. ప్రభుత్వ భూములు, పట్టాల కోసం చేసిన దరఖాస్తులను, ఇతర అంశాల్లో దరఖాస్తులు చేసిన వాటిని తిరస్కరిస్తున్నారు. ధరణి సమస్యలను పూర్తిచేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి కూడా మండలాల వారిగా రైతుల సమక్షంలోనే అధికారుల ఆధ్వర్యంలో దరఖాస్తులను పరిశీలిస్తూ ఎక్కడికక్కడ పరిష్కారం చూపుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలకు అనుగుణంగా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రతీరోజు దరఖాస్తులను సమీక్షిస్తున్నారు.

రికార్డులు తారుమారు

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ధరణిని ఆరేళ్ల క్రితం తీసుకొంచ్చి భూముల వివరాలన్నింటిని అందులో నమోదుచేసింది. రైతులకు కొత్తగా పట్టాలను అందించింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలోనూ యుద్ధప్రాతిపదికన పాత రికార్డులకు అనుగుణంగా వివరాలను ధరణిలో నమోదుచేశారు. డాటాఎంట్రీ చేసే సమయంలో చాలామంది రైతులకు సంబంధించిన పేర్లు, సర్వే నెంబర్లు, తండ్రి పేరు, భూముల విస్తీర్ణం, రైతు భూమి అయితే అసైన్డ్ అని, ఇళ్ల స్థలం అని కొన్ని పొరపాట్లు చేస్తూ వివరాలను నమోదుచేశారు. ఈ వివరాలను మార్చుకునేందుకు గత ప్రభుత్వం ధరణిలో ఎక్కువగా అవకాశం ఇవ్వకపోవడంతో రైతులు ఏళ్లతరబడి తహసీల్దార్ కార్యాలయం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు తిరుగుతున్నారు. మీసేవా ద్వారా దరఖాస్తు చేస్తూ పరిష్కరించాలని కోరుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎక్కువ మార్పులకు అవకాశం ఇవ్వకపోవడం, కలెక్టర్లకే అవకాశం ఇచ్చి కిందిస్థాయి అధికారులైన తహసీల్దార్లకు, ఆర్‌డీవోలకు ఇవ్వకపోవడంతో రైతులకు ఇబ్బందులు తలెత్తాయి. రైతుబంధుతోపాటు పంట రుణాలు కూడా తీసుకునేందుకు రైతులు సమస్యలను ఎదుర్కొన్నారు. భూములు వారే దున్నుకుంటున్నా తమపేరుపై లేకపోవడంతో పలు సమస్యలు ఎదుర్కొన్నారు. ధరణికి ముందు పట్టాలతోపాటు పహాణీలో సేతువారిలో వారిపేర్లే ఉన్నా అధికారులు మార్పులు చేసేందుకు ఆన్‌లైన్‌లో ఆప్షన్స్ ఇవ్వకపోవడం తో ఏళ్లతరబడి ఆ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. గత ప్రభుత్వం చివరిలో ధరణికి సంబంధించి కొన్ని మార్పులు చేసినా పూర్తిస్థాయిలో చేయకపోవడంతో సమస్యలు పరిష్కారం కాలేదు. ప్రతీరోజు ఏదోఒక గ్రామానికి చెందిన రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో పాటు సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.



కలెక్టర్, ఆర్డీవో స్థాయిలో దరఖాస్తులకు పరిష్కారం

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ధరణిపై పలు దఫాలు సమీక్షించింది. రైతు నాయకుడు కోదండరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేకకమిటీని ఏర్పాటు చేసింది. ధరణిపై పలు అధ్యాయనాలు చేయడంతోపాటు రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ఆ కమిటీ పలుసూచనలు చేసింది. రాష్ట్రప్రభుత్వ అధికారులతోపాటు మంత్రులతోనూ సమీక్ష జరిపి సీఎంతోపాటు రెవెన్యూ మంత్రికి నివేదికను ఇచ్చింది. కమిటీ సూచనలకు అనుగుణంగా ధరణిలో కొన్ని మార్పులను చేయడంతో పాటు తహసీల్దార్, ఆర్‌డీవో, కలెక్టర్ పరిధిలో దరఖాస్తులను వర్గీకరించి మూడంచెల పద్ధతిలో పరిష్కరించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. అధికారులతో సమీక్షించి ఆదేశాలను జారీ చేసింది. జిల్లాలో ధరణికి సంబంధించిన దరఖాస్తులు 49వేలకు పైగా ఉన్నాయి. రైతులు వెంట పడగా ఇప్పటివరకు 43వేల వరకు ఈ దరఖాస్తులు పరిష్కారమయ్యాయి. మిగతా 6వేలకు పైగా ఉన్న దరఖాస్తులను మూడంచెల పదతిలో పరిష్కరించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. తహసీల్దార్ పరిధిలో ఆయా మండలాలకు సంబంధించిన దరఖాస్తుల్లో పేరుమార్పిడీ, తండ్రిపేరు, ఇతర సమస్యలను పరిష్కరిస్తున్నారు. రైతుల భూములకు సంబంధించిన సర్వేనెంబర్లు, సాగువిస్తీర్ణం, ఎంట్రీ సమయంలో వ్యవసాయ భూమా, వ్యవసాయేతర భూమా వంటి ఎంట్రీలు తప్పుగా పడ్డ వాటిని పరిష్కరిస్తున్నారు. ఆర్‌డీవో, కలెక్టర్ స్థాయిలో మిగతా భూములకు సంబంధించి దరఖాస్తులను పరిష్కరిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా కలెక్టర్ ఈ ధరణి సమస్యలపై ప్రతీరోజు సమీక్షించడంతో పాటు తహసీల్దార్‌లు, ఆర్‌డీవోలకు ఆదేశాలు ఇస్తూ ఎక్కువగా పరిష్కరించేలా చూస్తున్నారు. అన్నదమ్ముళ్లకు సంబంధించి, తల్లిదండ్రులు చనిపోయిన పిల్లల పేరుపై భూముల మార్పువంటివి త్వరగా పరిష్కరిస్తున్నారు. పట్టాలతోపాటు ఇతర ధృవీకరణ పత్రాలను రైతులకు అందిస్తున్నారు. పూర్తిస్థాయిలో ఉన్న పెండింగ్ ధరణి దరఖాస్తులను వారం రోజుల్లో పరిష్కరించేలా ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. రాష్ట్రప్రభుత్వం ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో పెండింగ్ దరఖాస్తులన్నీ పరిష్కరించేలా ప్రయత్నాలు చేస్తున్నారు. కొన్నిచోట్ల ప్రభుత్వ భూములను తమ భూములుగా చూపి దరఖాస్తుచేసిన వాటిని మాత్రం పరిశీలించి తిరస్కరిస్తున్నారు.

అధికారులతో సమీక్షలు

ధరణి దరఖాస్తులను పరిష్కరించేందుకు సర్కారు ఆదేశాలు ఇవ్వడంతో మాజీ మంత్రి ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి బోధన్ నియోజకవర్గానికి సంబంధించి 2రోజులపాటు అధికారులతో సమీక్షించారు. ధరణి సమస్యలను సత్వరమే పరిష్కరించేలా అధికారులకు ఆదేశాలిచ్చారు. భూముల సమస్యలను పరిష్కరించడంతోపాటు రైతులకు పట్టాపాసు పుస్తకాలను అందించాలని రైతులు అధికారులను విన్నవించారు. పూర్తిస్థాయిలో సమీక్షించడంతో 2 రోజులపాటు కలెక్టర్ కూడా ఈసమావేశంలో పాల్గొన్నారు. పూర్తిస్థాయిలో అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతోపాటు కొన్నిచోట్ల వెంటనే రైతుల సమక్షంలోనే దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించి వారికి పత్రాలను అందించారు. జిల్లాలో ధరణి దరఖాస్తులను పరిష్కరించిన మీదట ఇతర సమస్యలపై దృష్టిపెట్టేందుకు రెవెన్యూ అధికారులు సిద్ధమవుతున్నారు. ప్రతీరోజు అన్నిజిల్లాల ధరణికి సంబంధించిన దరఖాస్తుల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టిపెట్టడంతో అధికారులు ఈ పనులకే ప్రాధాన్యత ఇస్తున్నారు. పెండింగ్ దరఖాస్తులన్నీ పూర్తయితే రైతులకు ఇబ్బందులు తప్పి రుణాలతోపాటు ఇతర పనులకు ఉపయోగపడే అవకాశం ఉంది.



రైతుకు ఆర్డర్ కాపీని అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

నెలాఖరులోగా పెండింగ్‌లో ఉన్న

ధరణి సమస్యలకు పరిష్కారం

- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నవీపేట, జూన్ 22: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ధరణి సమస్యల దరఖాస్తులన్నింటికీ ఈ నెలాఖరులోగా పరిష్కరిస్తామని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం అధికారులు, రైతుల సమావేశంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుతో కలిసి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో బీఆర్‌ఎస్ హయాంలో అర్హులైన రైతులకు పట్టా పాస్‌పుస్తకాలు ఇవ్వలేదని, దీంతో రైతులు ఇబ్బందులు పడ్డారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ధరణికి సంబంధించిన అన్నిసమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టిందని తెలిపారు. జిల్లాలో 46,746 దరఖాస్తులు రాగా, 40,271 దరఖాస్తులను పరిష్కరించినట్లు తెలిపారు. బోధన్‌లో 10వేల దరఖాస్తులు రాగా, 8,592 దరఖాస్తులను పరిష్కరించామని, నవీపేటలో 382 దరఖాస్తులకు 203 దరఖాస్తులను పరిష్కరించామని వెల్లడించారు. పలువురు రైతులకు పట్టాపాస్‌పుస్తకాల మంజూరు ఆర్డర్ కాపీలను అందజేశారు.

రైతులతో ఎమ్మెల్యే కలెక్టర్ ముఖాముఖీ

మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాల రైతులతో ఎమ్మెల్యే, కలెక్టర్ ముఖాముఖీగా భేటీ అయ్యారు. ఒక్కో రైతు సమస్యలను అడిగి తెలుసుకుని అందుకు గల కారణాల గురించి అధికారులను ఆరాతీశారు. ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో స్థలపరిశీలన చేయాలని ఆదేశించారు. దరఖాస్తులను సత్వరమే పరిష్కరిస్తూ వాస్తవ పరిస్థితులతో కూడిన నివేదికను ఆర్డీవో లాగిన్‌కు ఫార్వర్డ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్ర కుమార్, నాయకులున్నారు.

- ఎంపీ అర్వింద్ ఇంట్లోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న విద్యార్థి సంఘ నాయకులు



నీట్‌ను రద్దు చేయాలి

- ఎంపీ ఇంటిని ముట్టడించిన విద్యార్థి సంఘాల నాయకులు
- అడ్డుకున్న పోలీసులు
- పరిస్థితి ఉద్రిక్తం.. పలువురి అరెస్టు

నిజామాబాద్ అర్బన్, జూన్ 22: నీట్ పరీక్షను వెంటనే రద్దు చేయాలని, పేపరు లీకుపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని ఎంపీ అర్వింద్ ఇంటి ముట్టడి ఉద్రిక్తతకు దారి తీసింది. విద్యార్థి సంఘాల నాయకులు ఎంపీ అర్వింద్ ఇంట్లోకి వెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు విద్యార్థి సంఘాల నాయకులకు మధ్య తోపులాట జరిగింది. విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేసి 3వ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు గౌతంకుమార్, ఏబీపీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బోడ అనిల్‌కుమార్‌లు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే నీట్‌పరీక్ష ప్రశ్నపత్రం లీకై ఫలితాల్లో స్కామ్ జరిగిందని, ఒకే పరీక్ష కేంద్రంలో 8మంది విద్యార్థులకు 720కి 720 మార్కులు రావడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. ఒక్కో పరీక్షపత్రం లీకేజీలో రూ.లక్షలు చేతు లు మారాయని, దీంతో లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో కేంద్రప్రభుత్వం చెలగాటం ఆడుతుందన్నారు. ఒకే పరీక్ష కేంద్రంలో 67మంది ఎలా టాప్ ర్యాంకులు సాధిస్తారని, ఈ విషయమై సుప్రీం కోర్టులో పలు పిటిషన్‌లు దాఖలయ్యాయని అన్నారు. నీట్‌పరీక్ష ప్రశ్నపత్రం లీకుకు బాధ్యత వహిస్తూ ప్రధానిమోదీ వెంటనే రాజీనామా చేయాలన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేసి నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలన్నారు. పోలీస్ స్టేషన్‌లో ఉన్న విద్యార్థి సంఘ నాయకులను పలువురు నేతలు పరామర్శించారు. ఇందులో వేణురాజ్, మహేష్, అంజలి, నరేందర్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

19 మంది ఇన్‌స్పెక్టర్ల బదిలీ

ఖిల్లా, జూన్ 22: మల్టీ జోన్-1 పరిధిలో వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న 19 మంది ఇన్ స్పెక్టర్లను బదిలీ చేస్తూ ఐజీ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న పలువురిని పోస్టింగ్‌లో నుంచి తప్పించి వీఆర్‌కు అటాచ్ చేశారు. పీసీఆర్ నిజామాబాద్‌లో పనిచేస్తున్న వి.రాజశేఖర్‌రెడ్డిని మెదక్ రూరల్ సర్కిల్‌కు బదిలీ చేశారు. అదేవిధంగా వెయిటింగ్‌పై సీసీఎస్‌లో అ టాచ్‌గా ఉన్న ఏ.సురేష్‌ను సీసీఎస్-1 నిజామాబాద్‌కు బదిలీచేశారు. అక్కడ పనిచేస్తున్న ఎం.రమేష్‌ను వీఆర్‌కు పంపించారు. సీసీఎస్-1 నిజామాబాద్‌లో పనిచేస్తున్న ఎం.రమేష్‌ను మల్టీజోన్-1 ఐజీకు రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. టాస్క్‌ఫోర్స్ నిజామాబాద్‌లో పనిచేస్తున్న కె.పురుషోత్తంను ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి సర్కిల్‌కు బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న డి.శ్రీనివాస్‌ను బదిలీచేశారు. మరికొందరిని త్వరలోనే బదిలీ చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

- కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ నీతూకిరణ్
- సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్లు



సుదీర్ఘంగా కౌన్సిల్ సమావేశం

- ఏడుగంటల పాటు పలు సమస్యలపై వాడివేడి చర్చ
- దశాబ్దాలకు పైగా రిటైర్డ్ ఉద్యోగుల కొనసాగింపుపై సభ్యుల ఆక్షేపణ
- 68 ఎజెండా అంశాలపై కౌన్సిల్ ఆమోదం
- హాజరైన ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



మాట్లాడుతున్న కమిషనర్



మాట్లాడుతున్న కార్పొరేటర్

సుభాష్‌నగర్, జూన్ 22: గతంలో ఎన్నడూ జరగనంత సుదీర్ఘంగా నగర పాలక సంస్థ కౌన్సిల్ సాగింది. జిల్లా కేంద్రంలోని నూతన మున్సిపల్ కార్పొరేషన్ భవనంలో శనివారం నగర మేయర్ దండు నీతూకిరణ్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సుమారు 7 గంటల పాటు సాగిన కౌన్సిల్ సమావేశంలో ప్రారంభం నుంచే ఆరోపణలు, ప్రత్యారోపణలతో సభ్యుల మధ్య గందరగోళ వాతావరణం ఏర్పడింది. 21వ తేదీన నిర్వహించాల్సిన సమావేశాన్ని 22కు మార్పు చేయడంతో బీజేపీ, ఎంఐఎం కార్పొరేటర్ల మధ్య మాటల యుద్ధం జరిగింది. శుక్రవారం కావడంతో వాయిదా వేస్తున్నామని మేయర్ చెప్పడంపై బీజేపీ కార్పొరేటర్లు ఆందోళనకు దిగారు. అనంతరం నగర మున్సిపల్ కమిషనర్ మంద మకరంద్ సభ్యులకు పొరపాటు జరిగిందని చెప్పడంతో సభ ముందుకు సాగింది. సభలో అధికారులు లేకపోవడంతో కొద్దిసేపు సభకు అంతరాయం ఏర్పడింది. ఎలక్ట్రిసిటీ, ఆర్‌అండ్‌బీ, పోలీసులువచ్చే వరకు సభను సాగనివ్వలేదు. డివిజన్‌కు రూ.కోటి నిధుల పై సభ్యులు ఆందోళన వ్యక్తంచేశారు. రూ.30 కోట్ల పనిజరిగినా మిగతా 30కోట్ల నిధులు రాకపోవడంతో పనులు ఆగిపోయాయని నిధులు విడుదలయ్యేలా కృషి చేయాలని సభ్యులు కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన గృహజ్యోతి పథకం అందరికీ అందుబాటులో లేదని, 200 యూనిట్లు ఉన్న వారికి సైతం బిల్లులు వస్తున్నాయని సభ్యులు సమస్యలను లేవనెత్తారు. 200 యూనిట్లు వచ్చిన వారు తెల్లరేషన్ కార్డు ఉంటే బిల్లు కట్టనవసరం లేదని చెప్పడంతో సభ్యులు శాం తించారు. రేషన్ కార్డులపై కూడా కొంతసేపు చర్చ సాగిం ది. సమావేశంలో బీజేపీ ఫ్లోర్ లీడర్ స్రవంతిరెడ్డి, కార్పొరేటర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల కొనసాగింపుపై సభ్యుల ఆక్షేపణ

నగర పాలక సంస్థలో పదేళ్లకు పైగా రిటైర్డ్ ఉద్యోగులు కీలక పదవుల్లో కొనసాగుతున్నారని చాలాసార్లు ఉన్నతాధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని బీజేపీ, కాంగ్రెస్ సభ్యులు ఆరోపించారు. ప్రజాఆరోగ్య సమస్యలైన మున్సిపల్ హెల్త్ అధికారిగా దశాబ్దకాలంగా రిటైర్డ్ అయిన ఉద్యోగిని కొనసాగిస్తున్నారని, కనీసం ఎంబీబీఎస్ అర్హత కలిగిన ఉద్యోగి దొరకడం లేదా అంటూ ప్రశ్నించారు. ఎంహెచ్‌వోతోపాటు ఇతర శాఖల్లో సైతం రిటైర్డ్ అయిన ఉద్యోగులతో పనులు చేయిస్తున్నారని, మున్సిపల్ హెల్త్‌లో అవినీతి పెరిగిపోయిందని, రిటైర్డ్ ఉద్యోగులను సాగనంపాలని కోరారు.

శానిటేషన్ సిబ్బందిపై తడబడ్డ ఎంహెచ్‌వో

సానిటేషన్ సిబ్బంది విషయంలో ఎంహెచ్‌వో తడబడ్డారు. మొత్తం ఎంతమంది పనిచేస్తున్నారని సభ్యులు అడగగా పొంతన లేని సమాధానాలిచ్చారు. మొదటగా ఒక్కో డివిజన్‌లో 55మంది పనిచేస్తున్నారని చెప్పగా.. మళ్లీ 45మందే పనిచేస్తున్నారని చెప్పడంతో సభ్యులు ఆందోళనకు దిగారు. 10 మంది ఇతర సెక్షన్‌లో పనిచేస్తున్నారని వివరణ ఇచ్చారు. సరైన వివరణ ఇవ్వకపోవడంతో ఎంహెచ్‌వోపై సభ్యులు మండిపడ్డారు. ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ కలగజేసుకొని రెండు రోజుల్లో సానిటేషన్ సిబ్బందిపై వివరణ ఇవ్వాలని అధికారులను కోరడంతో గొడవ సర్దుమణిగింది. దీంతోపాటు జవాన్‌లను శానిటరి ఇన్‌స్పెక్టర్లుగా ప్రమోషన్ ఇవ్వడంపై సభ్యులు ఆందోళనకు దిగారు. జవాన్లను శానిటరి ఇన్‌స్పెక్టర్లుగా గుర్తించవద్దని, వారిని జవాన్లుగానే కొనసాగించాలని కోరారు.



అవినీతికి అడ్రస్‌గా నగర పాలక సంస్థ

- ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

నగర పాలక సంస్థ అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. అన్ని విభాగాల్లోని అధికారులకు నగర పాలక సంస్థ ఏటీఎంగా మారింది. కార్పొరేషన్‌లో బడ్జెట్ రూ.కోట్లలో కేటాయింపు ఉన్నా పనులు జరగడంలేదు. ప్రభుత్వ స్థలాలు కబ్జాలకు గురవుతున్నాయి. రిటైర్డ్ ఉద్యోగులు విధుల్లో ఉండటంలో ఆంతర్యమేమిటీ? కార్పొరేషన్‌ను కేంద్ర మంత్రుల సహాయంతో స్మార్ట్ సిటీగా చేస్తాం.

డివిజన్‌కు రూ.10లక్షలు ఇవ్వాలి

- న్యాలం రాజు, కార్పొరేటర్

డివిజన్‌కు రూ.10లక్షల చొప్పున అభివృద్ధికి కేటాయించాలి. రూ.కోటి నిధులను విడుదల చేయాలి. కాంగ్రెస్ చేపట్టిన గృహజ్యోతి, రేషన్ కార్డులను అందజేయాలి. శానిటేషన్‌లోని అక్రమాలపై విచారణ జరపాలి. జవాన్లను శానిటరి ఇన్‌స్పెక్టర్లుగా కాకుండా జవాన్లుగానే కొనసాగించాలి.



68 ఎజెండా అంశాలకు ఆమోదం

- దండు నీతూకిరణ్, మేయర్

నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో 68 ఎజెండా అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. డివిజన్‌కు రూ.10లక్షల చొప్పున జనరల్ ఫండ్ సుమారు రూ.6కోట్ల తక్షణ సహాయంగా విడుదల చేయనున్నాం. వర్షాకాలం కావడంతో డ్రైనేజీ తదితర అంశాలపై చర్చించి 68 ఎజెండా అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు.

ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా ?


చెక్ డ్యామ్ మధ్యలో ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు


విద్యుత్ స్తంభాలను తొలగించాలని వినతిపత్రం అందజేస్తున్న రైతు

- ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు
- పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు

ఎల్లారెడ్డి, జూన్ 22: ఎల్లారెడ్డి మండలంలోని అడవి లింగాల గ్రామ శివారులోని కల్యాణి వాగుపై నూతన చెక్ డ్యామ్ 2020 సంవత్సరంలో సుమారు 1.80 కోట్ల రూపాయలతో మంజూరు అయింది. విద్యుత్ శాఖ అధికారులు 2023లో ముందు చూపు లేకుండా నీటిపారుదల శాఖ అధికారులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా విద్యుత్ అధికారులు కళ్యాణి వాగుపై ఇష్టారాజ్యంగా నూతన విద్యుత్ లైన్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం చెక్ డ్యామ్ నిర్మాణం పూర్తయింది. అయితే మూడు విద్యుత్ స్తంభాలు చెక్ డ్యామ్ మధ్యలో కావడంతో వర్షాలు కురిస్తే ఆ ప్రాంతంలో భారీ వరదలు వచ్చే అవకాశాలు ఉంటాయి. వరదల ఉధృతికి విద్యుత్ స్తంభాలు కూలిపోయి వాగులో పడి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని ఆ ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు. అదే విధంగా స్తంభాలు కూలిపోతే ఆ ప్రాంత రైతులకు విద్యుత్ సరఫరా నిలిచిపోతాయి. విద్యుత్ స్తంభాలను తొలగించాలని రైతులు విద్యుత్ శాఖ ప్రజావాణిలో కూడా ఫిర్యాదు చేశారు. గత రెండు రోజులక్రితం ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు అధి కారుల సమీక్ష సమావేశంలో విద్యుత్ శాఖ అధికారులపై చాలా ఫిర్యాదులు వస్తున్నానయి ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతులు, అధికారులు ప్రజాప్రతినిధులు చెప్పినా కూడా తమకేమి పట్ట నట్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఉన్నత అధి కారులు విచారణ చేపట్టి ప్రమాదకరంగా ఉన్న స్తంభాలను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

కార్మికుల సంక్షేమమే ఏఐటీయూసీ లక్ష్యం

- ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య

బాన్సువాడటౌన్, జూన్ 22: కార్మికుల సంక్షేమమే ఏఐటీయూసీ లక్ష్యమని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య అన్నారు. శనివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన భవన నిర్మాణ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న సంఘం , భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికులకు సంక్షేమ బోర్డును సాధించిన ఘనత ఏఐటీయూసీదేనన్నారు. సహజ మరణం పొందిన కార్మికులకు 10 లక్షల రూపాయలు , 55 సంవత్సరాలు నిండిన బోర్డు సభ్యులందరికీ 5 వేల పెన్షన్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ డివిజన్ కార్యదర్శి దుబాస్‌రాములు , శంకర్ , ఎల్లయ్య , సాయిలు , సురేష్ , అంజయ్య , లక్ష్మీ , పోచవ్వ , జ్యోతి తదితరులున్నారు.

నేడు నల్ల పోచమ్మ పండుగ

మద్నూర్, జూన్ 22 : మద్నూర్ మండల కేంద్రంలో ఆదివారం నల్ల పోచమ్మ పండుగ జరుపుకోవ డానికి గ్రామ పెద్దలు నిర్ణయిం చారు. ఇందులో భాగంగా ఆయా కుల సంఘాల వారు సమావేశాలను ఏర్పాటు చేసుకుని నల్ల పోచమ్మ పండుగను భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకోవాలని తీర్మానించారు. ప్రతి ఏడాది వర్షాకాలంలో నల్ల పోచమ్మ పండుగ జరుపుకోవడం ఆచారంగా వస్తుంది. అదే విధంగా ఈ ఏడాది గ్రామంలో కలిసికట్టుగా అన్ని కుల సంఘాలు కలిసి పండుగ జరుపుకోవాలని నిర్ణయించారు.

ప్రారంభమైన పాలిసెట్ సర్టిఫికెట్ల పరిశీలన


కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు

నిజామాబాద్ అర్బన్, జూన్ 22:పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశానికి నిర్వహించిన పాలిసెట్-2024 మొదటి విడత కౌన్సెలింగ్ సర్టిఫికెట్ల పరిశీలన శనివారం ప్రారంభమైంది. నగరంలోని బాలుర పాలిటెక్నిక్ కళాశాలలో సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించారు. ఈనెల 25 వరకు సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించనున్నట్లు జిల్లా సమన్వయకర్త శ్రీరాంకుమార్, సిస్టమ్ అడ్మిన్ భానుచందర్ తెలిపారు. సర్టిఫికెట్ పరిశీలన పూర్తయిన విద్యార్థులు తప్పనిసరిగా వెబ్ ఆప్షన్స్ నమోదు చేసుకోవాలని వెబ్‌ఆప్షన్లు చేసుకున్న వారికి మాత్రమే సీటు కేటాయింపు ఉంటుందని వారు తెలిపారు. ఈనెల 27వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలని వారు తెలిపారు. శనివారం 425 మంది విద్యార్థులు సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌లో పాల్గొన్నారు.

నగరంలో పెట్రేగుతున్న భూకబ్జాదారులు

● రిజిస్ట్రేషన్ అధికారుల సహకారంతో ఇతరుల స్థలాలకు రిజిస్ట్రేషన్లు ● తీరు మార్చుకోని అధికారులు
● కాంగ్రెస్ పార్టీ భూముల కబ్జాపై ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ సీరియస్

ఖిల్లా, జూన్22: నగరంలో భూకబ్జాదారుల ఆగడాలు పెట్రేగిపోతున్నాయి. రిజిస్ట్రేషన్ శాఖాధికారుల సహకారంతో ఇతరుల భూములను అడ్డదారుల్లో రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్న ఘటనలు నగరంలో వెలుగు చూస్తున్నాయి. నగరంలో ఖాళీ స్థలాలు కనిపిస్తే చాలు వాటికి సంబంధించిన వివరాలను సేకరించి వాటి వారసులు లేకున్నా ఉన్నట్లు పత్రాలు సృష్టించి తమ పేర్లపై రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నట్లు ఇటీవల జోరుగా సాగుతున్నాయి. గతంలో నకిలీ పత్రాలను సృష్టించి రిజిస్ట్రేషన్లు చేసినా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు పట్టించుకోక పోవడంతో మరోసారి ఇటువంటి వాటికి అక్రమార్కులు తెరలేపుతున్నారు. తాజాగా నగరంలోని ధారుగల్లీలోని అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన స్థలాలను కొందరు అక్రమార్కులు అడ్డదారుల్లో రిజిస్ట్రేషన్లు చేయించుకున్న ఘటన వెలుగులోకి వచ్చింది. అందుకు సహకరించిన రిజిస్ట్రేషన్ శాఖాధికారి గతంలో కూడా ఇటువంటి రిజిస్ట్రేషన్లకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఉన్నతాధికారులు వారిపై చర్యలు తీసుకోకపోవడంతో వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ నకిలీ పత్రాలు సృష్టించి నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు చేశారు. నగరంలోని దారుగల్లీ, హైమదీబజార్ సమీపంలో కాంగ్రెస్ డీసీసీ పేరిట వ్యాపార సముదాయాల స్థలాలు ఉన్నాయి. 8-4-359 ఇంటి నంబరు పేరిట ఏడు అసెస్‌మెంట్ నెంబర్లు ఉన్నట్లు సమాచారం. అక్రమార్కులు ఆ నంబరుకు /1వేసి తమ పేరున రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తెలిసింది. బై/1వేసిన నంబరులో సుమారు 43.65 గజాల స్థలాన్ని కబ్జాదారులు తమ పేరున రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు సమాచారం. రిజిస్ట్రేషన్ చేసుకున్న స్థలానికి నిబంధనలు లేకుండా అడ్డదారుల్లో మున్సిపల్‌లో నమోదు చేయించుకున్నారు. మున్సిపల్ రికార్డుల్లో పక్కాగా వివరాలున్నా పరిశీలించకుండానే రిజిస్ట్రేషన్ పూర్తిచేసినట్లు సమాచారం. ఆ స్థలం విలువ సుమారు లక్షల్లో ఉన్నట్లు తెలిసింది.

● భూముల కబ్జాపై ఎమ్మెల్సీ సీరియస్

కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన భూములు కబ్జాకు గురవ్వడంపై ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్ సీరియస్ అయ్యారు. నగరంలోని ఆహ్మదీబజార్ వద్ద గల కాంగ్రెస్ పార్టీకి చెందిన భూములను కొందరు కబ్జా చేసి విషయాన్ని తెలుసుకున్న ఆయన జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డిని అక్కడికి పంపి భూములను సందర్శించాలని, ఎక్కడెక్కడ భూములు ఉన్నాయో గుర్తించాలని సూచించినట్లు తెలిసింది. దీంతో కబ్జాకు గురైన స్థలాన్ని నగర అధ్యక్షుడు కేశవేణు, తాహెర్‌బిన్‌హందాన్ సందర్శించినట్లు తెలిసింది.

మత్తుపదార్థాల వినియోగాన్ని అరికడదాం

● ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్


కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

డిచ్‌పల్లి,జూన్ 22: తెలంగాణ రాష్ట్రాన్ని మత్తుపదార్థాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు తమ వంతు సహకారం అందజేస్తామని ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. శనివారం రెండోరోజు బర్ధిపూర్ శివారులో గల కృష్ణహోటల్లో నిర్వహించిన ఇండియన్ సైక్రియాట్రిక్ సోసైటీ, ఇందూరు న్యూరో సైకియాట్రిక్ ఆధ్వర్యంలో నిర్వహించిన వార్షిక మహాసభలకు ఎమ్మెల్సీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. మత్తు పదార్థల నివారణ కోసం వైద్యులు ఇలాంటి అవగాహన సదస్సులు నిర్వహించడం అభినందనీయమన్నారు. రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి మాట్లాడుతూ.. మత్తు పదార్థాలపై తెలంగాణ రాష్ట్ర సైకియాట్రిక్ అసోసియేషన్ బృందానికి ఆయన అభినందనలు తెలిపారు. మత్తుపదార్థాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటుందని వైద్యులు కూడా ఇలాంటి అవగాహన సదస్సులు నిర్వహించడం వల్ల ఎంతో మేలు జరుగుతుందన్నారు. జాతీయ అధ్యక్షులు డా.లక్ష్మీకంత్రా టిడా.ప్రతీమ మూర్తి, డా.కిషన్ సైకియాట్రిక్ డాక్టర్ విశాల్, డా.జార్జిరెడ్డి, డా.ఫనికాంత్, సాయికిరణ్, రవితేజా, మీనాజ్, ఆశమౌనిక, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలలపై విద్యార్థి సంఘాల దాడులు సరికాదు

● డీఈవోను కలిసిన ట్రస్మా ప్రతినిధులు


డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ట్రస్మా ప్రతినిధులు

నిజామాబాద్ అర్బన్, జూన్ 22:జిల్లాలోని ప్రైవేటు పాఠశాలలపై విద్యార్థి సంఘాల దాడులు సరికాదని దాడులపై నిరసన వ్యక్తం చేస్తూ పాఠశాల నిర్వహణకు సహకరించాలని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం (ట్రస్మా) ఆధ్వర్యంలో శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్‌వి దుర్గాప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ట్రస్మా జిల్లా అధ్యక్షుడు నిత్యానంద్, రాష్ట్ర అధికార ప్రతినిధి జయసింహాగౌడ్‌లు మాట్లాడుతూ విద్యార్థి సంఘాలు, పాఠశాలల యాజమాన్యాలు కలిసి పనిచేస్తేనే మంచి విద్యను పిల్లలకు ఇవ్వడానికి వీలవుతుందని, ప్రైవేటు పాఠశాలలు ఇస్తున్న సౌకర్యాలు వ్యాపార దృక్పథంతో కాకుండా తల్లిదండ్రుల సౌకర్యం కోసం ఏర్పాటు చేసినవిగా భావించి విద్యార్థి సంఘాలు సహకరించాలన్నారు. మన ప్రాంత విద్యార్థులు ఉన్నత విలువలతో కూడిన మంచి విద్యను అందుకోవడానికి సహకరించాలని విద్యార్థి సంఘాల సూచనలు, సలహాలు తాము ఆదరిస్తామని వారు అన్నారు. ప్రతి విద్యాసంవత్సరం ప్రారంభంలో విద్యార్థి సంఘాల పేరుతో కొంత మంది యువకులు పాఠశాలలపై దాడి చేస్తూ విద్యార్థులను, ఉపాధ్యాయులను, పాఠశాల యాజమాన్యాలను భయపెడుతూ పాఠశాల నిర్వహణకు ఆటంకం కలిగించడం సరికాదన్నారు. జాతీయ, రాష్ట్రస్థాయి గుర్తింపు పొందిన విద్యార్థి సంఘాలకు, వారి ఉద్యమాలకు ప్రైవేటు పాఠశాలలు చేయూతను ఇస్తున్నాయని అన్నారు. కొంత మంది వ్యక్తులు సంఘాల పేరుతో బలవంతపు వసూళ్లు చేస్తూ బడ్జెట్ స్కూళ్లను, చిన్న చిన్న స్కూళ్లను ఇబ్బందులకు గురిచేస్తున్నారని స్వయం ఉపాధి కోసం ఏర్పాటు చేసిన ప్రైవేటు పాఠశాలలు ఎక్కువగా ఉన్నాయని వారి జీతభత్యాలు కూడా సరిగ్గా ఇవ్వలేని పరిస్థితుల్లో పాఠశాలలు ఉంటే ఇలాంటి ఒత్తిడిల వల్ల మానసికంగా వేధపడుతూ చాలా మంది ప్రైవేటు పాఠశాలల నిర్వహకులు అప్పులపాలవుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి గోజూరి అరుణ్, నగర అధ్యక్షుడు ధర్మరాజు, కోశాధికారి నాగరాజు, మోహన్, వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

జోస్‌అలుక్కాస్‌లో ఆభరణాల కొనుగోలుపై ప్రత్యేక ఆఫర్‌లు



జోస్ అలుక్కాస్‌లో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నగర మేయర్

నిజామాబాద్ అర్బన్, జూన్ 22:బంగారు ఆభరణాల కొనుగోలుపై వినియోగదారులకు ప్రత్యేక ఆఫర్లను అందజేయడం సంతోషకరమని నగర మేయర్ దండునీతూకిరణ్ అన్నారు. శనివారం నగరంలోని జోస్ అలుక్కాస్ జ్యువెల్లరి షోరూమ్‌లో ఆఫర్ల ప్రారంభ కార్యక్రమాన్ని పురస్కరించుకొని ప్రత్యేక ఆఫర్ల బ్రోచర్‌ను మేయర్ ఆవిష్కరించారు. ఆభరణాల వ్యాపారంలో ప్రముఖంగా ఉన్న జోస్ అలుక్కాస్ ప్రత్యేక ఆఫర్లు ఇవ్వడం సంతోషకరమన్నారు. ప్రస్తుతం బంగారు ఆభరణాల కొనుగోలుపై తరుగులో ఫ్లాట్ 50 శాతం డిస్కౌంట్ ఇస్తున్నామని, అలాగే డైమండ్ నగల కొనుగోలుపై 20 శాతం, ప్లాటినం నగర కొనుగోలుపై 7 శాతం డిస్కౌంట్ ఇస్తున్నారని అన్నారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ సజయ్ పికె, అకౌంట్స్ మేనేజర్ సజేష్, ఫ్లోర్ మేనేజర్ రాజేష్ సిబ్బంది పాల్గొన్నారు.

పది రోజుల్లో ధరణి సమస్యలు పరిష్కరించండి

● తహసీల్దార్‌ను ఆదేశించిన ఎమ్మెల్యే


డిచ్‌పల్లి మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి

డిచ్‌పల్లి,జూన్ 22:పది రోజుల్లోగా ధరణి సమస్యలను పరిష్కరించేలా రెవెన్యూ అధికారులు ప్రత్యేకచొరవ చూపాలని పెండింగ్ సమస్యల వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని గ్రామీణ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి అన్నారు. మండల పరిషత్ సమావేశం ఎంపీపీ చిన్నొళ్ల నర్సయ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు గడిచిన 10ఏళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో ధరణి ధరఖాస్తులు లక్షలాదిగా పెండింగ్‌లో ఉన్నాయని వాటి పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చొరవతో పరగణి స్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నేరవేరుస్తు ముందుకు సాగుతు న్నామని రైతాంగానికి 2లక్షల రుణమాఫీ కూడా క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ఐకేపీ ఉద్యోగులు ఉద్యోగులగా పనిచేసుకోవాలని రాజకీయాలు చేస్తే సహించేది లేదన్నారు. 200యూనిట్ల కరెంట్ బిల్లు, 500రూ. గ్యాస్ , సిలిండర్ ధరఖాస్తు చేసుకున్నవారు ఎంపీడీవో కార్యాలయాల్లో ధరఖాస్తులు చేసుకోవాలని ఇందుకు అధికారులు సహకరించాలన్నారు. పోడు భూముల రైతులకు పట్టా పుస్తకాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ధరణి సమస్యలు జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో పరిష్కారమయ్యే పనులు పెండింగ్‌లో ఉన్నాయని వాటి పరిష్కారానికి అధికారులు సహకరించాలన్నారు. 400 ధరణి ధరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని గ్రామాల్లో గిరిజన తండాల్లో రేషన్ షాపులు ఇన్‌చార్జ్‌లను నియమించకుండా ఆయా గ్రామాల వారికే బాధ్యతలు అప్పగించాలన్నారు దూస్‌గాం రోడ్డు నిర్మాణ పనులను టెండర్‌లు పిలిచిన కాంట్రాక్టర్ మహేందర్ పనులు చేయడానికి ముందుకు రావడం లేదని ఆర్ అండ్‌బీ ఏఈ మనోహర్ ఎమ్మెల్యేతో వివరించారు. రెండుమార్లు నోటీసులు కూడా కాంట్రాక్టర్‌కు ఇచ్చామన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన గొర్రెల డీడీలు పెండింగ్ లో ఉన్నాయని ఎమ్మెల్యే ప్రశ్నించారు. పంచాయతీ భవనాల నిర్మాణం, సబ్‌సెంటర్ నిర్మాణ పనులు పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. పూర్తి స్థాయిలో శిథిలవస్థకు చేరినట్యాంకులను తీసివేయాలని వివరాలను నివేదిక అందజేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. తొలిసారిగా ఎమ్మెల్యేగా మండల సమావేశానికి వచ్చిన భూపతిరెడ్డిని ఎంపీపీ నర్సయ్య, జడ్పీటీసీ ఇందిరా,వైస్ ఎంపీపీ సాయిలులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్, ఎంపీవో శ్రీనివాస్ గౌడ్, తహసీల్దార్ ప్రభాకర్, ఎంఈవో రాజగంగారం, ఇతర అధికారులు , ఎంపీటీసీలు అఫీసర్లు, పాల్గొన్నారు.

రైతు రుణమాఫీపై కర్షకుల హర్షం

ఏర్గట్ల, జూన్ 22: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ ప్రకటించడంతో శనివారం మండలంలోని కర్షకులు, కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చడం పట్ల అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి డెలిగేట్ జడ్డం జీవన్, ముస్కు మోహన్, పన్నాల నర్సారెడ్డి, కురాకుల భూమన్న, జితేందర్, రైతులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మోపాల్, జూన్ 22:మోపాల్ మండల కేంద్రంలో శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు.పార్టీ అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల వారికి న్యాయం జరుగుతుందన్నారు.

మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని వినతి


మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న లిఫ్ట్ చైర్మన్

నందిపేట, జూన్22: ఉమ్మడి నందిపేట మండలంలో ఉన్న ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి లిఫ్ట్ చైర్మన్ వినతిపత్రం అందజేశారు. శనివారం హైదరాబాద్‌లోని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని డీసీసీ డెలిగేట్ పెంట ఇంద్రుడు, లిఫ్ట్ చైర్మన్‌ల ఫోరం అధ్యక్షుడు మోర్తాడ్ బోజారెడ్డి ఆధ్వర్యంలో నందిపేట, డొంకేశ్వర్ మండలాల్లో ఉన్న ఎత్తిపోతల పథకాలకు మరమ్మత్తులు చేయాలని అందుకు తగినన్ని నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా లిఫ్ట్ చైర్మన్‌లు, తదితరులు ఉన్నారు.

సిరికొండలో ఎక్సైజ్ దాడులు


దాడులు నిర్వహించిన ఎక్సైజ్ అధికారులు

సిరికొండ, జూన్ 22:మండలంలోని గడ్డమీది తండా, నడిమితాండా, ముషీర్‌నగర్, వర్ధన్‌తాండా, ఒంటిప్ప తండాలలో ఎక్సైజ్ సిబ్బంది దాడులు నిర్వహించి నాటుసారాను పట్టుకున్నారు. ఈ దాడుల్లో 10లీటర్ల ఎల్‌టీఎస్ గుడుంబా, 200 లీటర్ల బెల్లం పానకం స్వాధీనం చేసుకొని ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ వేణుమాదవ్ తెలిపారు. ఈ ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ దాడుల్లో ఇన్స్‌పెక్టర్ విలాస్, టాస్క్‌ఫోర్స్ ఇన్స్‌పెక్టర్ పి.స్వప్న, సిబ్బంది ఉన్నారు.

‘ఆశలకు నష్టం కలిగించొద్దు’


వినతిపత్రం ఇస్తున్న ఆశవర్కర్లు

ఇందల్వాయి, జూన్ 22:ఆశలకు నష్టం కలిగించే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఆశకార్యకర్తలు వైద్య సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆశలకు నష్టం కలిగించే విధంగా పరీక్ష పెట్టే విధానాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని సమ్మే సందర్భంగా గత ప్రభుత్వం ప్రస్తుతం ఇచ్చిన హామీలు ఇతర సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో ఆశవర్కర్లు గిరిజన ప్రాంతంలో గత 33 సంవత్సరాలు, గ్రామీణ ప్రాంతాల్లో గత 19 సంవత్సరాల నుండి పనిచేస్తున్నారని ఆరంభం నుండి ఇప్పటి వరకు ప్రభుత్వం నిర్వహించిన అనేక ట్రైనింగ్‌లు పొందారని అన్నారు. రిజిస్టర్లు రాయడం, సర్వేలు చేయడం, ఆన్‌లైన్ విధానం ద్వారా పనిచేయడం, వివిధ రకాల జబ్బులకు పరీక్షలు నిర్వహించి అన్ని గుర్తిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న మందులను ప్రజల ఇంటి వద్దకు వెళ్లి తగు జాగ్రత్తలను చెబుతూ ఎప్పటికప్పుడు ప్రజలకు సేవలు అందిస్తున్నామని కొత్తగా పరీక్ష విధానాన్ని తీసుకువచ్చి ఆశకార్యకర్తలకు నష్టం చేకూర్చవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశవర్కర్స్ జిల్లా ఉపాధ్యక్షురాలు స్వప్న, ఆశాకార్యకర్తలు గంగలక్ష్మి, ప్రమీల, నిర్మల, హరిత, తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న యూనియన్ నాయకులు

రెంజల్,జూన్22: మండలంలోని కళ్యాపూర్ గ్రామానికి చెందిన జర్నలిస్టు చింతల ప్రదీప్ గత నెలలో క్యాన్సర్‌తో పోరాడి మృతి చెందారు. శనివారం టీయూడబ్ల్యూజే ఐజేయూ యూనియన్ అధ్యక్షుడు ఎడ్ల సంజీవ్, ప్రధాన కార్యదర్శి అరవింద్ బాలాజీ, యూనియన్ నాయకులు పరామర్శించారు. ఆయన కుటుంబానికి సానుభూతిని తెలిపారు. జర్నలిస్టుల యూనియన్ తరఫున కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని, పిల్లల చదువుకు తమ యూనియన్ తరఫున బాధ్యత తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు చట్టం ప్రసాద్, సంజీవ్, మాజీసర్పంచ్ షైని మోహన్, పాత్రికేయులు కిరణ్, నాగిరెడ్డి, గంగాధర్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులగణన వెంటనే చేపట్టాలి

వేల్పూర్, జూన్22: బీసీ కుల గణనను వెంటనే చేపట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం బాల్కొండ నియోజకవర్గ అధ్యక్షుడు మొండి అశోక్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన వేల్పూర్‌లో విలేకరులతో మాట్లాడారు. దేశంలో నేటికి బీసీల భవితవ్యం కోసం జరగాల్సిందంత జరగలేదన్నారు. రాజకీయ పార్టీలు బీసీలను ఓట్లేసే యంత్రాలుగానే చూశాయి తప్ప వాళ్ళ జీవన ప్రమాణాలను పెంచేందుకు చేసిందేమి లేదన్నారు. బీసీల అభ్యున్నతి అంటే ఎన్నికల ముందు బీసీ డిక్లరేషన్‌లు ప్రకటించి చేతులు దులుపేసుకుంటున్నారన్నారు. దేశానికి స్వాతంత్ర్య వస్తే బహుజన మహా జనవళికి ఏం చేస్తారో చెప్పాలని 150ఏళ్ళ క్రితమే మహాత్మజ్యోతిరావుపూలే అడిగిన ప్రశ్నకు నేటికి సమాధానం దొరకలేదన్నారు. బీసీలకు అన్ని రంగాల్లో రావల్సిన ఆర్థిక, రాజకీయ, సామాజిక స్వాతంత్ర్యం మాత్రం ఇంక రాలేదన్నారు. దేశంలో సగానికి పైగా ఉన్న బీసీల కుల గణన ఇప్పటికీ జరగలేదన్నారు. కులగణన చేయాలన్న బీసీల డిమాండ్‌ను నెహ్రూ, ఇంది రాగాంధీ, రాజీవ్‌గాంధీ మొదలుకొని నేటి ప్రధాని మోదీ వరకు అందరు పక్కన బెట్టారన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

బోధన్‌రూరల్,జూన్22: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ ఉందని, ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రభుత్వం అన్ని రకాల వసుతులను కల్పిస్తుందన్నారు. నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని విశ్రాంత ఉపాధ్యాయుడు శివప్రసాద్ అన్నారు. శనివారం బోధన్ మండలంలోని అమ్దాపూర్, ఊటపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలను అందజేశారు. విద్యార్థులు శ్రద్ధగా చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ సూర్యకుమార్, ప్రధానోపాధ్యాయులు ధన్‌రాజ్, అమ్దాపూర్ మాజీ సర్పంచ్ సత్యనారాయణ, ఊటపల్లి మాజీ సర్పంచ్ కృష్ణ గుప్తా, ఉపాధ్యాయులు ఉమా, రాధ,వాసవి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అల్పాహారంలో బల్లి.. విద్యార్థుల ఆందోళన

● తెలంగాణ యూనివర్సిటీ బాలికల హాస్టల్‌లో ఘటన ● వంట మనిషి తొలగింపు

డిచ్‌పల్లి,జూన్ 22: తెలంగాణ విశ్వవిద్యాలయంలోని బాలికల హాస్టల్‌లో దారుణ ఘటన చోటుచేసుకుంది. శనివారం వెలుగులోకి రావడంతో విద్యార్థులు విస్మయానికి లోనయ్యారు ఓ విద్యార్థిని అల్పాహారం భుజిస్తున్న సమయంలో ప్లేట్‌లో బల్లి దర్శనం ఇచ్చింది. దీంతో విద్యార్థులు ఒక్కసారిగా షాక్‌కు గురై తోటి విద్యార్థులకు విషయం తెలుపగా విద్యార్థులు ఆందోళన చేశారు. ఈ విషయం బయటికి పొక్కకుండా అధికారులు విద్యార్థులను హెచ్చరించినట్లు తెలిసింది. విషయం పొక్కకుండా ఏన్ని జాగ్రత్తలు తీసుకున్నా విద్యార్థుల సంఘం నాయకులు ముందుకు వచ్చి ఆందోళన చేశారు. గతంలో కూడా వర్సిటీ వసతి గృహల్లో నాసిరకం భోజనం అందిస్తున్నారని ఆరోపించినా అధికారులకు పట్టించుకోకపోవడంతో నిత్యం ఇలాంటి సమస్యలు వస్తున్నాయని, ఆ విద్యార్థిని బల్లి పడిన ఆహారం తిని ఉంటే పరిస్థితి మరోవిధంగా ఉండేదని ఇది అధికారుల నిర్లక్ష్యమేనని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నాయి. ఘటనపై విచారణ చేపట్టాలని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ యూనివర్సిటీ బాలికల వసతి గృహంలో ఉదయం అల్పాహారంలో బల్లి రావడంతో ఈ ఘటనకు విద్యార్థి సంఘాలు, విద్యార్థులు ఆందోళన చేయడంతో వర్సిటీ అధికారులు హాస్టల్ వంట మనిషి రాజేశ్‌ను సస్పెండ్ చేశారు.

ఎస్ఎఫ్ఐ నిరసన..

తెలంగాణ విశ్వవిద్యాలయంలోని బాలికల హాస్టల్‌లో అల్పాహారంలో వచ్చిన బల్లి ఘటన జరిగినా వర్సిటీ అధికారులు స్పందించకపోవడం శోచనీయమని సంబంధిత కేర్ టేకర్‌ను సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాచకొండ విఘ్నేశ్ డిమాండ్ చేశారు. తెలంగాణ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ సందీప్‌కుమార్ సుల్తానీయ వర్సిటీని వెంటనే సందర్శించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించకుంటే ఆందోళనలు ముమ్మరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మహేశ్, గణేశ్, వేణురాజ్, పాల్గొన్నారు.




టీయూ బాలికల హాస్టల్‌లో అల్పాహారంలో పడిన బల్లి
హాస్టల్ ఎదుట నిరసన తెలుపుతన్న విద్యార్థులు

గిరిజన శక్తి

విద్యార్థి సంఘం నిరసన

సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలని గిరిజన శక్తి విద్యార్థి సంఘం వర్సిటీ అధ్యక్షుడు శీను నాయక్ డిమాండ్ చేశారు. శనివారం బాలికల హాస్టల్ ఎదుట విద్యార్థులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనునాయక్ మాట్లాడుతూ.. అధికారుల నిర్లక్ష్యమే ఈ ఘటనకు కారణమన్నారు. ఇలాంటి సంఘటనలుపునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

వీసీ ఆదేశాల మేరకు చర్యలు

● రిజిస్ట్రార్ యాదగిరి

తెలంగాణ విశ్వవిద్యాలయంలో బాలుర వసతి గృహంలో అల్పాహారంలో వచ్చిన కళేబారం గుర్తించామని రిజిస్ట్రార్ యాదగిరి తెలిపారు. బాలికల కేర్ టేకార్ దృష్టికి రాగానే అల్పాహారం పడేసి మిగిలిన వారికి వంట చేసి ఇవ్వడం జరిగిందన్నారు. ఇంచార్జ్ వీసీ ఆదేశాల మేరకు చీఫ్ వార్డెన్ సూచన మేరకు హెడ్ కుక్ రాజేశ్ ను సస్పెండ్ చేసి విధుల నుంచి తొలగించినట్లు రిజిస్ట్రార్ తెలిపారు. మిగిలిన సిబ్బంది విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కిచెన్ లో అపరిశుభ్రత ఉండకుండా చూడాలని నాణ్యమైన వండాలని రిజిస్ట్రార్ సూచించారు. హాస్టల్ కేర్ టేకర్, వార్డెన్ ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి

కోటగిరి,జూన్22: పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ పేర్కొన్నారు. కోటగిరి మండల కేంద్రంలో మలేరియా మాసం సందర్భంగా శనివారం లార్వా సర్వే నిర్వహించారు. మండల కేంద్రంలోని 16, 17వ వార్డుల్లో పర్యటించి లార్వాను తొలగించారు. ప్రజలకు, యువకులకు జాతీయ కీటక జనత వ్యాధులపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి రోజు వేడి చేసి, చల్లార్చిన నీటిని సేవించాలని, వేడివేడి తినుబండారాలు భుజించాలని సూచించారు. ఆహారం తీసుకునే ముందు చేతుల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఇంటి ఆవరణలో పగిలిన కుండీలు, ఆవరణలో నీరు నిల్వలేకుండా చూడాలన్నారు. నీటి గుంతలను తొలగించడంతో పాటు మురికి కాలువలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం ఓ ప్రైవేటు పాఠశాలలో విద్యార్థులకు దోమల వల్ల వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్ జ్యోతి, ఆరోగ్య కార్యకర్తలు రోజా, శ్రీదేవి, మంజుల, పాఠశాల ప్రిన్సిపాల్ రజిని, ఉపాధ్యాయులు హన్మంత్ రావు, శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

'మహిళా సంఘాలు మరింత అభివృద్ధి'

డిచ్‌పల్లి,జూన్ 22: రాబోవు ఐదేళ్లలో మహిళా సంఘాలు లక్ష కోట్ల రుణాలను అధిగమించాలని 25వేల కోట్లు వ్యాపార అభివృద్ధికి వినియోగించుకోవాలని డీఆర్‌డీవో పీడీ సాయాగౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని టీటీడీసీలో మహిళ శక్తి జిల్లా శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పమని, అందుకు ఐకేపీ అధికారులు దృఢసంకల్పంతో పనిచేయాలని సూచించారు. ప్రతి మహిళ మహిళా సంఘంలో ఉండాలన్నారు. శ్రీనిధి ద్వార 2లక్షల రుణా సదుపాయం కల్పించాలని పేర్కొన్నారు. సభ్యురాలు ప్రమాదవశత్తు మరణిస్తే 10లక్షల రుపాయాలు బీమా వర్తింపజేయాలన్నారు. సంఘాలు వ్యాపారినికి సంబంధించిన మార్కెట్ బ్రాండ్‌లను డెవలప్‌మెంట్ చేయడం అమ్మ ఆదర్శ పాఠశాలలో వీవో అధ్యక్షురాలి అధ్యక్షతన స్కూల్ బిల్డింగ్ రిపేర్లు మరమ్మత్తులు చేయించాలన్నారు. స్కూల్ యూనిఫాంలు, అంగన్ వాడీ యూనిఫాంలు, ఇతర ప్రైవేట్ కంపెనీల యూనిఫాంలు డ్వాక్రా సంఘాలకు అప్పగించాలన్నారు.

మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం వెంటే మేమంతా

● జడ్పీటీసీ నారోజీ గంగారాం
● హైదరాబాద్ తరలిన నాయకులు

రుద్రూరు, జూన్ 22 : మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి వెంటే మేమంతా ఉంటామని జడ్పీటీసీ నారోజి గంగారాం పేర్కొన్నారు. శనివారం రుద్రూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో వివిధ గ్రామాల నుంచి తాజా మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ప్రస్తుత ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఆయనకు మద్దతుగా నిలిచారు. రుద్రూరు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మద్దతుదారులు ఆయన వెంటే ఉంటామని, కాంగ్రెస్ పార్టీ నాయకులతో తాము కలిసికట్టుగా ఉంటామని ముకకంఠంతో మద్దతు తెలుపుతున్నామని జడ్పీటీసీ నారోజీగంగారాం పేర్కొన్నారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరడాన్ని తామంతా స్వాగతిస్తున్నామని, బాన్సువాడ నియోజకవర్గం అభివృద్ధి కోసమే కాంగ్రెస్ పార్టీలో చేరారని, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినప్పటికీ మరింత అభివృద్ధి చేయాల్సింది ఉందన్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఆయన సీనియారిటీని గుర్తించి ఆయనను పార్టీలోకి స్వాగతించిందన్నారు. తామంతా పోచారం వెంటే నడుస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో నాయకులు అక్కపల్లి నాగేందర్, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ తోట సంగయ్య, జనరల్ సెక్రటరీ బాల్‌రాజ్, టౌన్ అధ్యక్షుడు తోట్ల గంగారాం, వైస్ ఎంపీపీ నట్కారి సాయిలు, ఏఎంసీ మాజీ అధ్యక్షులు సంజీవ్, సొసైటీ మాజీ అధ్యక్షులు పత్తి రాము, కో ఆప్షన్ మెంబర్ మస్తాన్, రుద్రూరు మండల మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ నారోజీ గంగారాం

వర్ని : బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లడాన్ని తామంతా స్వాగతిస్తున్నట్లు వర్ని మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. శనివారం వర్ని మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. పోచారంనకు మద్దతుగా తాము బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నట్లు నాయకులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో విండో చైర్మన్ నామాల సాయిబాబా, మండల పార్టీ అధ్యక్షుడు గిరి, నానిబాబు, సీహెచ్ గంగారాం, కరీం, శ్రీనగర్ రాజుతో పాటు ఆయా గ్రామాలకు చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కలిసిన కాంగ్రెస్ శ్రేణులు..

బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డిని శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో చందూర్ మండల జడ్పీటీసీ అంబర్ సింగ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కలిశాయి. ఎమ్మెల్యే పోచారం బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో చేరడంపై హర్షం వ్యక్తం చేశారు. పోచారం రాకతో చందూర్ మండలం మరింత ప్రగతి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పోతరాజు శ్రీనివాస్, మల్లయ్య, సంజీవ్, బాలకిషన్ గౌడ్, లతీఫ్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

మురికి కాలువలో పసికందు లభ్యం

ఖిల్లా, జూన్ 22 :నగరంలోని మూడవ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని జిల్లా పరిషత్ కార్యాలయం సుభాష్‌నగర్‌లో మురికి కాలువలో అప్పుడే పుట్టిన శిశువు లభించినట్లు ఎస్ఐ ఎల్‌ప్రవీణ్ తెలిపారు. స్థానికుల సమాచారంతో అక్కడికి తమ సిబ్బందితో చేరుకుని మృతిచెంది ఉన్న శిశువును జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించామన్నారు. శిశువుకు సంబంధించిన వివరాలపై విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. గత మూడు, నాలుగు రోజుల క్రితం నుంచి ఈరోజు వరకు ఎవరైనా మహిళ ప్రసవించి ఉండి తన ఆడ పసికందును సుభాష్‌నగర్ జడ్పీ కార్యాలయం సమీపంలోని మురికికాలువలో వదిలి వెళ్లి ఉంటుందని ఆరా తీస్తున్నారు. ఎవరికైనా సమాచారం ఉంటే తమ సెల్‌నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. సెల్‌నంబర్లు 8712659839, 8712659836, 8712659807.

కళ్యాపూర్‌లో కిరాణ దుకాణంలో చోరీ

రెంజల్,జూన్22: మండలంలోని కళ్యాపూర్ గ్రామానికి చెందిన బోర్గాం గంగాధర్ కిరాణ షాపుతో పాటు బోర్గాం సాయమ్మ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. కిరణాషాపులో గల 15వేల విలువ గల సామాన్‌తో పాటు నగదును అపహరించారు. సాయమ్మకు చెందిన ఇంటి నుంచి రూ.5వేల నగదును అపహరించినట్లు గ్రామస్థులు తెలిపారు. నిందితులను పట్టుకోవాలని బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

మున్నూరుకాపు నూతన కార్యవర్గం ఎన్నిక

ఇందల్వాయి, జూన్ 22: మండల మున్నూరుకాపు నూతన కార్యవర్గాన్ని శనివారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మున్నూరుకాపు మండల అధ్యక్షుడిగా లోలం గ్రామానికి చెందిన బుట్ట గంగాధర్, ఉపాధ్యక్షుడిగా సిర్నాపల్లి గ్రామానికి చెందిన ఎల్ఐసీ గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా తిర్మన్‌పల్లి గ్రామానికి చెందిన సాదురవి, సహాయ కార్యదర్శి మల్లాపూర్‌కు చెందిన జల్లెల శ్రీనివాస్, కోశాధికారిగా అన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన దొంతుల గంగాధర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు బుట్ట గంగాధర్ మాట్లాడుతూ బీసీ కులాల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేస్తానని బీసీలందరూ ఏకమై ఆర్థికంగా, రాజకీయంగా ఇంకా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఐడిసిఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, సిర్నాపల్లి గ్రామ మాజీసర్పంచ్ తేలు విజయ్‌కుమార్, వివిధ గ్రామాల మున్నూరుకాపు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కలిసిన నాయకులు



కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని కలిసిన బీజేపీ నాయకులు

మెండోర, జూన్22: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను బీజేపీ బాల్కొండ నియోజకవర్గ నాయకులు కరీంనగర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పూలమాల శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టి రాష్ట్రానికి వచ్చిన బండిసంజయ్‌ను బాల్కొండ నియోజకవర్గ బీజేపీ నాయకులు రుయ్యడి రాజేశ్వర్, బీజేపీ జిల్లా కార్యదర్శి నాగులపల్లి రాజేశ్వర్, కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లె లింగారెడ్డి, యువమోర్చ జిల్లా కార్యదర్శి అనుప్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు.

ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో పోస్టర్ల ఆవిష్కరణ

ఆర్మూర్‌టౌన్, జూన్22: పట్టణంలోని దేశాయి బీడీ కంపెనీలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో శనివారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ బీడీవర్కర్స్ యూనియన్ రాష్ట్రకార్యదర్శి ఎస్.ముత్తెన్న మాటాడుతూ జిల్లా కేంద్రంలోని దుర్గంపుడి వెంకటకృష్ణ వర్ధంతి సందర్భంగా సీపీఎం మాస్‌లైన్ పార్టీ స్మారకస్థూపాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, ఈనెల 26న స్థూపఆవిష్కరణ అనంతరం బహిరంగ సభ ఉంటుందని, బడుగు బలహీనవర్గాలు బీడీకార్మికుల హక్కుల కోసం పోరాడిన మానవతా వాది అని అన్నారు. బహిరంగసభను విజయవంతం చేయాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు శ్రీనివాస్, నజీర్, భద్రయ్య, గంగాధర్, రాజన్న, గంగ, వాణి, మేనక, పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తులు పరిశీలించిన చైర్‌పర్సన్

ఆర్మూర్‌టౌన్, జూన్22: మున్సిపల్ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తులను మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య శ్రీనివాస్ పరిశీలించారు. లబ్ధిదారులకు జీరో బిల్లుతో పాటు సిలిండర్ సబ్సిడీ పొందేలా కంప్యూటర్‌లో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. గతంలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు సాంకేతిక లోపంతో జీరో బిల్లు వర్తించలేదని, ప్రస్తుతం నమోదులో ఎలాంటి తప్పులు చేయవద్దని ఆమె సూచించారు.

ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేయాలి

ఆర్మూర్‌రూరల్, జూన్ 22: ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేయాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో శనివారం మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వివేకానందరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ప్రైవేటు కార్పొరేట్ స్కూల్ బస్సులను పరిశీలించాలని, డ్రైవర్‌కు డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు బస్సులో ఫస్ట్‌ఎయిడ్ కిట్ అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. నిబంధనలు పాటించని బస్సులను సీజ్ చేయాలని వారు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి పరిషత్ ఆర్మూర్ ఇన్‌చార్జి అఖిల్, మహేష్, వర్ధన్, సాయి, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ

నవీపేట,జూన్22: అర్హులైన రైతులందరికీ 2లక్షల రూపాయల రుణమాఫీ చేపట్టడం జరుగుతుందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల రుణమాఫీకి సంబంధించి సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు ప్రత్యేకంగా ఆదేశాలు జారీ చేశారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు వచ్చే ఆగస్టు 15లోగా రుణమాఫీని పూర్తిగా అమలు చేయడం జరుగుతుందన్నారు.

'నాణ్యతా ప్రమాణాలతో పనులు చేపట్టాలి'

నవీపేట,జూన్22: మండలంలోని వివిధ గ్రామాలలో చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్‌తో పాటు పలు శాఖలకు చెందిన అధికారులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనులు, ఎన్ఆర్ఈజీఎస్ పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని లేనట్లయితే అధికారులపై తగిన చర్యలు ఉంటాయని అన్నారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాలలో తాగునీటి సరఫరాపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష జరిపారు. మండలంలో రోడ్లపై కేజీవీల్స్ నడిపితే సంబంధిత వాహన యజమానులపై కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు.

కోస్లీలో భూముల పరిశీలన

నవీపేట,జూన్22: బోధన్ నుంచి భైంసా వరకు నూతనంగా చేపట్టిన 161బీబీ జాతీయ రహదారి విస్తరణ పనులలో భాగంగా కోస్లీలో రోడ్డు విస్తరణలో కోల్పోతున్న భూములను శనివారం నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్ పరిశీలించారు. సంబంధిత భూములలో ఉన్న బోరుబావులను సైతం ఆయన పరిశీలించారు. రోడ్డు విస్తరణలో భూములు, బోరుబావులు కోల్పోతున్న రైతులకు త్వరలో తగిన పరిహారం అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నారాయణ ఉన్నారు.

జూనియర్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులకు ఆహ్వానం

ఆర్మూర్‌రూరల్, జూన్22: ఆలూర్ మండల కేంద్రంలోని తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాల, కళాశాలలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో విద్యా బోధన చేయడానికి జూనియర్ లెక్చరర్ ఫిజిక్స్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సయ్యద్‌షైదర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు ఎంఎస్సీ ఫిజిక్స్, బీఎడ్ విద్యార్హతలు కలిగి ఉండి జూనియర్ కళాశాల అధ్యపకునిగా కనీసం మూడేళ్ల అనుభవం ఉన్నవారు అర్హులన్నారు.

మేకల సంతలో తాగునీటి వసతి ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



సంతలో ఏర్పాటైన నీటి వసతి

నవీపేట,జూన్22: మండల కేంద్రంలో ప్రతి శనివారం జరిగే మేకల సంతలో గ్రామ పంచాయతీ అధికారులు తాగునీటి వసతిని ఏర్పాటు చేశారు. ఈ నెల 16న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన నవీపేట సంతలో 'మేకపోతులకు భలే డిమాండ్, మేకల సంతలో తాగునీటి కటకట' అనే కథనానికి గ్రామ పంచాయతీ అధికారులు స్పందించారు. మేకల సంతకు వచ్చే వ్యాపారులకు తాగునీటి వసతిని ఏర్పాటు చేయడంతో పాటు మూగజీవాలకు సైతం తాగునీటి కోసం తొట్టెలను ఏర్పాటు చేశారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనులు వేగవంతం చేయండి

● జడ్పీ సీఈవో ఉషా



కూనేపల్లిలో అమ్మ ఆదర్శ పాఠశాల పనులు పరిశీలిస్తున్న సీఈవో

రెంజల్,జూన్22: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను శనివారం కూనేపల్లి ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ పాఠశాలలో జడ్పీ సీఈవో ఉషా పరిశీలించారు. పనులలో నిర్లక్ష్యం వహించకుండా పనులను పూర్తిచేయాలని సూచించారు. పాఠశాలలు ప్రారంభమై 12 రోజులు కావస్తున్నా పనులలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని కాంట్రాక్టర్ సూచించారు. త్వరితగతిన పనులను చేపట్టాలని సూచించారు. ఆమె వెంట ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో గణేష్ రావు, పీఆర్ ఏఈ వినయ్‌కుమార్, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

జూనియర్ లైన్‌ఇన్‌స్పెక్టర్ రవి సస్పెండ్

సుభాష్‌నగర్, జూన్ 22: నాగారం సెక్షన్ పరిధిలో పనిచేస్తున్న జూనియర్ లైన్‌ఇన్‌స్పెక్టర్ బానోత్ రవిని సస్పెండ్ చేస్తూ టీజీఎన్‌పీడీసీఎల్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కొన్ని రోజుల క్రితం నాగారం సెక్షన్ పరిధిలోని ఏఈ సంతకాన్ని ఫోర్జరీ చేశారన్న ఆరోపణతో ఎస్ఈ రవీందర్ విచారణకు ఆదేశించారు. ఏడీఈ క్వాలిటీ కంట్రోల్ ఇచ్చిన రిపోర్టుతో శనివారం బానోత్ రవిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎడపల్లిలో అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన

ఎడపల్లి, జూన్ 22: మండలంలోని నెహ్రూనగర్, జైతాపూర్, ఎడపల్లి అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి రసూల్ బీ పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో విద్యార్థుల శాతాన్ని, బాలింతలు, గర్భవతులు ఎందరు ఉన్నారో వివరాలను అంగన్‌వాడీ టీచర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బ్రాహ్మణ్‌పల్లి గ్రామంలో అంగన్‌వాడీ టీచర్ లేకపోవడంతో, అంగన్‌వాడీ కేంద్రం నడపడానికి గ్రామస్థులతో ఆమె మాట్లాడి గ్రామస్థులు ఆర్థికంగా సహకారం అందిస్తే తాత్కాలికంగా టీచరును నియమించి అంగన్‌వాడీ కేంద్రాన్ని నడుపుతామని ఆమె గ్రామస్థులతో తెలిపారు. అందుకు గ్రామస్థులు అంగీకరించగా సోమవారం నుంచి అంగన్‌వాడీ కేంద్రాన్ని నడుపనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో సిడీపీఓ జానకమ్మ, సూపర్ వైజర్ విజయ రాణి, అంగన్‌వాడీ టీచర్లు, బ్రహ్మణ్ పల్లి గ్రామస్థులున్నారు.

'విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడటం దారుణం'

ధర్పల్లి, జూన్ 22:కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మండల కేంద్రంలో గల కళాశాలలో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం అన్ని రంగాలను నిర్వీర్యం చేస్తుందన్నారు. విద్యారంగం పూర్తిగా అస్తవ్యస్తం అయిందని నీట్‌ను రద్దుచేసి తిరిగి పరీక్ష నిర్వహించాలన్నారు. ఒకవైపు విద్యారంగానికి బడ్జెట్‌లో నిధులు కోత పెడుతూ మరోవైపు లీకేజీలతో గ్రామీణ విద్యార్థుల ఉసురు పోసుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యు రాష్ట్ర నాయకులు అనిల్, అశీష్, దామోదర్, మమత పాల్గొన్నారు.

'ఎరాజ్‌పల్లి కార్యదర్శిని బదిలీ చేయొద్దు'

బోధన్‌రూరల్,జూన్22: మండలంలోని ఎరాజ్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిని బదిలీ చేయవద్దని శనివారం గ్రామప్రజలు జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ తమ గ్రామంలో పంచాయతీ కార్యదర్శిగా బాలకృష్ణ సక్రమంగా విధులు నిర్వహించారని, గ్రామంలోని వార్డుల్లో సతమతమవుతున్న ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడే పరిష్కరించారన్నారు. అలాంటి గ్రామపంచాయతీ సెక్రెటరీ బదిలీ చేయవద్దని కోరారు. గ్రామంలోని సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ అందరి అభిమానాలు చురగొన్నారని ఉత్తమమైన సెక్రెటరీని బదిలీ చేయడానికి కొందరు పన్నాగాలు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏరాజ్‌పల్లి గ్రామ కార్యదర్శిగా బాలకృష్ణను కొనసాగించే విధంగా ఉన్నతాధికారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్థులు రజినికాంత్ రెడ్డి, గోపాల్ దాస్, సతీష్, రవి, సంజీవ్, రాజు, తదితరులున్నారు.

27న తైబజార్ వేలం

నందిపేట, జూన్ 22:తైబజార్ వేలం పాట నిర్వహిస్తున్నట్టు పంచాయతీ కార్యదర్శి నవీన్ తెలిపారు. ఈనెల 27న నిర్వహిస్తామన్నారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.150	రూ.280	రూ. 300
వెన్‌కాబ్(కిలో)	రూ.155	రూ.285	రూ. 305

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.73400	రూ.67,700	రూ.935

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్
స్క్రీన్-1 : మహారాజ (11.05, 4.30, 7.35, 10.40)
: మరణం (2.10)
స్క్రీన్-2 : ఇన్‌సాడ్ ఔట్-2 (ఇంగ్లీష్ 3డి) (11.30, 5.05) ఏ (1.50)
: జహంగీర్ నేషనల్ యూనివర్సిటీ(7.25)
: ముంజియా (హిందీ) (10.35)
స్క్రీన్-3 :సందేహం (11.20)
: హనిమూన్ ఎక్స్‌ప్రెస్ (2.00)
: హరోం హర (4.40)
: ఓ మంచి గోస్ట్ (హిందీ) (10.40)
స్క్రీన్-4 : ఇట్లు మీ సినిమా (11.45)
: నిందా (2.20, 7.50, 10.30)
: ప్రభుత్వ జూనియర్ కళాశాల (5.00)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..
స్క్రీన్-1 : మహారాజ (1.45, 4.40, 7.35, 10.30)
స్క్రీన్-2 :ఓ మంచి గోస్ట్ (11.10, 4.35)
ప్రభుత్వ జూనియర్ కళాశాల (1.40)
నిందా (7.30, 10.25)
స్క్రీన్-3 : మనమే (1.35, 4.40, 10.30)
: సందేహం (7.40)

దేవి : మహారాజ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ :చందు చాంపియన్ (11.15, 2.15, 6.15,9.15)
విజయ్ : నిందా (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్